చింతల్ బస్టాప్ సమీపంలో ఇలా..



చింతల్ షా థియేటర్ ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనాలు



చింతల్ ప్రధాన రోడ్డులోని ఓ హోటల్ ఎదుట కార్ల పార్కింగ్



పార్కింగ్.. జామ్

● ఇష్టానుసారంగా రోడ్లపైనే వాహనాల పార్కింగ్ ● రోడ్లు కుంచించుకుపోయి నిత్యం ట్రాఫిక్ జామ్



ఐడీపీఎల్ చౌరస్తాకు సమీపంలో జగద్గిరిగుట్ట నుంచి వచ్చే రోడ్డులో నిలిపిన వాహనాలు

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్ల వెంబడి వాహనాల పార్కింగ్‌లతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని ఐడీపీఎల్ – జగద్గిరిగుట్ట రోడ్డు, కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా మొదలుకుని ఐడీపీఎల్ చౌరస్తా వరకు రోడ్లను ఆనుకునే కార్లు, ద్విచక్ర వాహనాలు నిలుపుతున్నారు. నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతం అక్రమ పార్కింగ్‌లతో ఇతర వాహనదారులకు ఇబ్బందులకు గురవుతున్నారు.

◆ ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న షాపింగ్‌మాల్స్, దుకాణాలు, హోటళ్లకు వచ్చే కొనుగోలుదారులు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రోడ్లనే పార్కింగ్ అడ్డాలుగా మార్చుకుంటున్నారు. దీంతో కోట్లాది నిధులు వెచ్చించి రోడ్ల వెడల్పు చేపట్టినా ట్రాఫిక్ సమస్యలు మాత్రం తీరడం లేదు. ఆయా దుకాణదారులు, మాల్స్ నిర్వాహకులకు తాకీదులు ఇవ్వాల్సిన ట్రాఫిక్ పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా షా థియేటర్ భవనంలో ఉన్న మాల్ ముందు, చింతల్ ప్రధాన రోడ్డులో వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు.

అక్రమ పార్కింగ్‌లకు కట్టడి చేస్తాం..



ప్రధాన రోడ్ల వెంబడి వాహనాలను నిలిపితే చర్యలు తప్పవు. ఇప్పటికే పలు షాపింగ్ మాల్స్, రెస్టారెంట్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశాం. కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా నుండి ఐడీపీఎల్ చౌరస్తా వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అక్రమ పార్కింగ్‌లను కట్టడి చేస్తాం. రోడ్లపై వాహనాలను నిలిపి మరమ్మతులు నిర్వహించే మెకానిక్‌లను గుర్తించి చలాన్‌లు విధిస్తాం.

– వెంకట్‌రెడ్డి, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని భౌరంపేట్ ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రణీత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రణీత్ ఫ్లోరా ప్రాంతంలో విద్యుత్ ఉండదని ఏఈ తెలిపారు.

◆ **డాక్టర్స్‌కాలనీ కేబుల్ ఫీడర్ పరిధిలో**

నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ స్కూల్, తిరుమల ఫర్నీచర్, జుడోమాల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సమ్మయ్య తెలిపారు.

◆ **బాచుపల్లి చౌరస్తా ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో**

బాచుపల్లి చౌరస్తాలో హెచ్ఎండీఏ ఫ్లైఓవర్ పనుల నేపథ్య బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఎల్‌జీ, ఎస్ఎంఎస్ ఫీడర్ల పరిధిలోని శిఖర విల్లాస్ నుంచి బాచుపల్లి ట్రాఫిక్ సిగ్నల్స్ వరకు, బాచుపల్లి పోలీస్‌స్టేషన్, శ్రీనివాస లేక్‌వ్యూ, బాచుపల్లి కమ్యూనిటీ హాలు వెనుక వీధి, గణేశ్ మండపం, ఎస్ఆర్ఆర్ ప్రైడ్, లోటస్ ప్రైడ్, సాన్వి కన్‌స్ట్రక్షన్స్, కౌసల్య మణిదీపం, శ్రీరామా హోమ్స్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సమస్యలను నా దృష్టికి తీసుకురండి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు

కుత్బుల్లాపూర్: కాలనీలు, బస్తీల్లోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు పలు సమస్యలపై విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈనెల 31వ తేదీన స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు అందజేసే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని షాపూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారిణి నవనీత ఆహ్వాన పత్రిక అందజేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవి అణచివేత ధోరణి

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న గౌడ సంఘం నేతలు

కుత్బుల్లాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్ఎంపీ, పీఎంపీల అణచివేత ధోరణిని అవలంభిస్తున్నాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ధన్వంతరి అనుభవ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో పేద, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం సేవలందించే ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులపై ఈ మధ్య తరచూ దాడులు జరగడం బాధాకరమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని విధాల అండగా నిలిచామన్నారు. ప్రభుత్వ మార్పు తర్వాత ఇటువంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ **గౌడ కులస్తుల సమస్యలను పరిష్కరించాలి**

కుత్బుల్లాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే వివేకానంద్‌కు గౌడ కులస్తుల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. స్థానికంగా గౌడ సంఘం సంక్షేమ భవనాన్ని నిర్మించాలననారు. కుత్బుల్లాపూర్ గ్రామంలోని కల్లు సొసైటీలో సభ్యుడిగా ఉన్న ప్రతి ఒక్కరికి ప్రతి సంవత్సరం రూ.50వేలు ఇవ్వాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన గౌడ కులస్తులకు కల్లు సొసైటీ సభ్యత్వం ఇవ్వాలని తెలిపారు. కుటుంబ సభ్యుడు మృతి చెందినపుడు రూ.50వేల ఆర్థిక సహాయం, కుటుంబంలో ఆడబిడ్డల వివాహం జరిగిన సమయంలో సొసైటీ నుంచి రూ.లక్ష ఆర్థిక సహాయం, ప్రతి సంవత్సరం కులదైవమైన రుణుక ఎల్లమ్మ పండుగ జరపాలని కోరారు. సంఘం అధ్యక్షుడు కూన రాజ్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులు మద్దెల గణేష్‌గౌడ్, పల్లా ప్రసాద్‌గౌడ్, బాసుపల్లి వ్యాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు కూన శ్రీనివాస్‌గౌడ్, బాసుపల్లి సందీప్‌గౌడ్, కూన శ్రవణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

◆ **జగద్గిరిగుట్ట డివిజన్‌లో కృతజ్ఞత యాత్ర...**

మగ్దుంనగర్, బిహార్‌బస్తీ, సీసలబస్తీ, భగత్‌సింగ్ మార్గ్, శ్రీనివాస్‌నగర్, రింగ్‌బస్తీ, పాలాల బస్తీ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే కృతజ్ఞత యాత్ర నిర్వహించగా సంక్షేమ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్పొరేటర్ జగన్, శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ వేణు యాదవ్, అధ్యక్షుడు రుద్ర అశోక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కృష్ణగౌడ్, జైహింద్, హజ్రత్ అలీ, మహిళా అధ్యక్షురాలు ఇందిరాగౌడ్, పాపుల్‌గౌడ్, శశిధర్ తదితరులు ఉన్నారు.

ఏపీలో కులగణనను వ్యతిరేకించడం అవివేకం

ఉస్మానియాయూనివర్సిటీ: ఆంధ్రప్రదేశ్‌లో కులగణనను నిలిపివేయాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ ఈసీకి లేఖ రాయడం అవివేకమని బీసీ సంక్షేమ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. మతిభ్రమించి మాట్లాడుతున్న ఆయన్ను విశాఖలోని మానసిక వైద్యశాలలో చేర్పించాలన్నారు. సీఎం వైఎస్ జగన్ పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తుంటే కావాలని కొందరు కుట్రలు పన్నుతున్నారని కులగణనతోనే బీసీల హక్కులు సాధించుకోగలమన్నారు.

డీజీపీకి జేఏసీ నేత ఫిర్యాదు

ఉస్మానియాయూనివర్సిటీ: తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణపై ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ సురేష్ యాదవ్ మంగళవారం రాష్ట్ర డీజీపీ రవిగుప్తాకు ఫిర్యాదు చేశారు. మామిడి హరికృష్ణ తనను హత్య చేయాలని కొందరికి సుపారి ఇచ్చినట్లు ఆరోపించారు. గత కొంత కాలంగా తనను చంపుతానని సుపారి గ్యాంగ్ ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని సెల్ నంబర్లను డీజీపీకి అందించారు. మామిడి హరికృష్ణతో తనకు ప్రాణహాని ఉందన్నారు.

ఓయూలో విద్యార్థుల అరెస్ట్

ఉస్మానియాయూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీతో పాటు ఇతర కోర్సులకు పెంచిన ఫీజులను రద్దు చేయాలని ఆందోళన చేపట్టిన విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు వీసీ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతులలో జరిగిన అక్రమాల విచారణ చేపట్టాలన్నారు.

నిజాంపేట్‌ను ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతాం

మేయర్ కొలన్ నీలారెడ్డి



నిజాంపేట్ సర్వసాధారణ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. మంగళవారం డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కమిషనర్ రామకృష్ణరావులతో కలిసి మేయర్ 21వ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్‌కు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు రావడం, కార్పొరేషన్ ఏర్పడి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇంజినీరింగ్, పరిపాలన, పట్టణ ప్రణాళిక, హార్టికల్చర్, పారిశుద్ధ్యం, ఆరోగ్య, పారిశుద్ధ్యం తదితర విభాగాలకు సంబంధించి ప్రతిపాదనలు, ఆయా డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, చేపట్టబోయే నిర్మాణాభివృద్ధి పనులకు నిధులు, కావాల్సిన మౌలిక సదుపాయాలు, పెండింగ్ దశలో ఉన్న పనులు తదితర అంశాలపై చర్చించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. వీధి కుక్కల బెడద, ట్రాఫిక్ ఇబ్బందులు, దోమల ఫాగింగ్ వంటి అంశాలను ప్రతినిధులు లేవనెత్తగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, కో.ఆప్షన్ సభ్యులు, ఆయా విభాగాల అధికారులు ఉన్నారు.

పట్టణ సమాఖ్య అధ్యక్షురాలిపై ఫిర్యాదు



జెడ్‌సీకి అభిలాషకు ఫిర్యాదు చేస్తున్న సమాఖ్య మహిళా గ్రూపు సభ్యులు

కుత్బుల్లాపూర్: పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు తీరుతో తమకు బ్యాంక్ రుణాలు అందడం లేదని కుత్బుల్లాపూర్ సర్కిల్ సమైక్య మహిళా గ్రూపు సభ్యులు మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాషను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రూపు సభ్యులు మాట్లాడుతూ... 1997 నుంచి తాము గ్రూపు సభ్యులుగా ఉన్నామన్నారు. 2010 నుంచి ఎస్ఎల్ఎఫ్‌గా ఏర్పడిన తర్వాత బ్యాంకుల్లో డబ్బులు పొదుపు చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. సమాఖ్య అధ్యక్షురాలు విజయలక్ష్మి తాము జమ చేసిన రూ.34 లక్షల నగదు లెక్కలు చూపడం లేదన్నారు. దీంతో సీఈవోలు మహిళా గ్రూపు రుణాల ఇచ్చే విషయంలో కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. రుణాల విషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన జెడ్‌సీ సంబంధిత అధికారులతో విచారణ జరిపించి బ్యాంక్ రుణాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు సభ్యులు తెలిపారు. సమాఖ్య గ్రూపు సభ్యులు దేవకరుణ, రమాదేవి, గీత తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తయ్యే వరకు ట్రాఫిక్ సమస్యే..



బీరప్పనగర్ ప్రధాన రహదారిలో 450 ఎంఎం దయా పైపులు

జగద్గిరిగుట్ట: అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయ లోపం కారణంగా వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డివిజన్ పరిధిలోని బీరప్పనగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించాల్సి ఉంది. ప్రధాన రహదారిలో పనులు నిమిత్తం రెండు వారాల క్రితం రోడ్డు ప్రక్కనే 450 ఎంఎం డయా సివర్ పైపులను డంప్ చేశారు. కాని ఇప్పటి వరకు ఆ పనులను మాత్రం ప్రారంభించలేదు. దీంతో నిత్యం వందలాది వాహనాలు వెళ్లే ఈ దారిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ విషయమై వాటర్ వర్క్స్ మేనేజర్ అంకిత్ భరద్వాజ్‌ను వివరణ కోరగా వీలైనంత తొందరగా పనులను పూర్తిచేస్తామని తెలిపారు. పనులు పూర్తయ్యే వరకు వాహనదారులకు ఇబ్బందులు తప్పేలా లేవనే చెప్పాలి.

కప్పి తీసుకెళ్లండి..



జగద్గిరిగుట్ట రోడ్డులో మోతాదుకు మించి ఇసుకను తరలిస్తూ..

జగద్గిరిగుట్ట: భవన నిర్మాణ సామగ్రి తరలించడంలో ఎటువంటి నిబంధనలు పాటించడం లేదు. సామగ్రిని మోతాదుకు మించి వాహనాలలో తీసుకెళ్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ముఖ్యంగా ఇటుక, ఇసుక తరలించే సమయంలో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిర్మాణ సామగ్రి తరలించే సమయంలో దానిపై కవర్లు కప్పి తీసుకెళ్లాల్సి ఉంటుంది. కానీ అవన్నీ పట్టించుకోకుండానే తీసుకెళ్తున్నారు. ఇలా తీసుకెళ్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

భూగర్భ డ్రైనేజీ పనుల పరిశీలన



ఆదర్శనగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్

రంగారెడ్డినగర్: డివిజన్‌లో మౌలిక సదుపాయాలను మెరుగు పర్చడానికి శాయశక్తులా కృషి చేస్తున్నానని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆదర్శనగర్‌లో రూ.73 లక్షల నిధులతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విజయశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. కొత్త పైపులైన్ ఏర్పాటుతో స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ సమస్య తీరనుందన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్పొరేటర్ వెంట జలమండలి అధికారులు, ఆయా బస్తీల సంక్షేమ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

బెల్ట్ షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలో విచ్చలవిడిగా విక్రయిస్తున్న బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ కె.జగన్ అన్నారు. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం జగన్ మాట్లాడుతూ.. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు సమయపాలన లేకుండా అక్రమంగా బెల్ట్ షాపులో మద్యం విక్రయాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. బెల్ట్ షాపుల వల్ల నిరుపేద ప్రజలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా పలు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బెల్ట్ షాపు విక్రయదారులపై చర్యలు తీసుకొని శాంతిభద్రతలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరసింహ ముదిరాజ్, బాలు, సంతోష్, యాదగిరి, సంపత్‌రెడ్డి, సునీల్, రాయి విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సులో మంటలు



మంటలను ఆర్పుతున్న జీడిమెట్ల ఫైర్ సిబ్బంది

జీడిమెట్ల: పార్కింగ్ చేసి ఉన్న ఓ ప్రైవేట్ బస్సులో మంటలు అంటుకున్న సంఘటన షాపూర్‌నగర్‌లో చోటు చేసుకుంది. జీడిమెట్ల ఫైర్ ఆఫీసర్ సుభాష్ రెడ్డి వివరాల ప్రకారం.. షాపూర్‌నగర్‌లోని వాటర్ ట్యాంక్ సమీపంలో ఆర్.కె ట్రావేల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు(ఏపీ28టీడీ3567) పార్కింగ్ చేసి ఉంది. మంగళవారం ఉదయం 10గంటల సమయంలో బస్సు నుంచి మంటలు వచ్చాయి. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు ఫోన్ చేయగా జీడిమెట్ల ఎస్సై అంజనేయులు ఫైర్ ఆఫీసుకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. పక్కనే ఉన్న మరో రెండు బస్సులు సైతం పాక్షికంగా కాలాయని అధికారులు తెలిపారు. మంటలను గల కారణం ఇంకా తెలియరాలేదు ఎవరైనా కావాలని చేశారో మరి ప్రమాదవశాత్తు జరిగిందో తెలియదని బస్సు యజమాని అన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



మాజీ కార్పొరేటర్ గౌరీష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఆలయ కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని మాజీ కార్పొరేటర్ గౌరీష్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీవిజయదుర్గా ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇచ్చిన మాట ప్రకారం ఆలయ ప్రాంగణంలో బోరు వెయించి మోటారు బిగించిన నేపథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు గౌరీష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

సీటుబెల్ట్.. హెల్మెట్.. తప్పనిసరి

నిజాంపేట్: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వీఆర్ఎస్ వీజేఐటీ కళాశాల నుంచి బాచుపల్లి చౌరస్తా వరకు విద్యార్థులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు తప్పనిసరిగా సీటుబెల్టు ధరించాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో మొబైల్‌లో మాట్లాడటం వంటివి చేయొద్దన్నారు. చాలా వరకు ప్రమాదాలు మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని సీఐ పేర్కొన్నారు. ఈ ర్యాలీలో పోలీసులు మల్లేశం, సుభాష్ పాల్గొన్నారు.



ఇళ్లు తొలగించనున్న వెన్నెలగడ్డ ప్రాంతం ఇదే..



నోటీసులు అందుకున్న బాధితులు



నోటీసులు వెనక్కు తీసుకోవాలి

- బీజేపీ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి
- ఎన్నా చెరువు సుందరీకరణకు పూనుకున్న అధికారులు
- బఫర్ జోన్‌లో ఇళ్లు ఉన్నాయంటూ స్థానికులకు నోటీసులు
- 40ఏళ్లుగా ఉంటున్న వారికి పట్టాలు మంజూరు చేసిన గత ప్రభుత్వం



బాధితులతో కలిసి ఉపకమిషనర్‌ను కలిసిన బీజేపీ నేత భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: ఎన్నో ఏళ్ల నుంచి జీవనం సాగిస్తున్న వారికి ఇటీవల టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేయడం కలకలం రేపింది. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ పరిధిలో ఉన్న వెన్నెలగడ్డ ఎన్నా చెరువు కట్టపై గత కొన్ని ఏళ్లుగా సుమారు 80 నిర్మాణాదారులు జీవనం సాగిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ చెరువు సుందరీకరణ పేరిట సర్వే నిర్వహించగా బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలు ఉన్నట్లు తేలింది.

◆ దీంతో ప్రొసీడింగ్ నెంబర్ 2729/ టీపీఎస్/ సీ అండ్ 25/ కేజెడ్/ జీహెచ్ఎంసీ/2024 పేరిట ఈనెల 22వ తేదీన ఇక్కడ నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న వారికి నోటీసులు జారీ చేయడం ఇప్పుడు ఆ ప్రాంతంలో అలజడి నెలకొంది. సుమారు 40 సంవత్సరాల క్రితమే ఇక్కడ నిర్మాణాలు ఉండగా ప్రభుత్వం పట్టాలు కూడా మంజూరు చేసింది.

◆ ఈ క్రమంలో మున్సిపల్ పర్మిషన్ తీసుకుని బహుళ అంతస్తుల నిర్మాణాలు కూడా పూర్తి చేసుకున్నారు. అయితే సడన్‌గా నోటీసులు జారీ చేయడం ఇప్పుడు కలకలం రేపుతోంది. ఇదే విషయంపై నోటీసులు అందుకున్న నిర్మాణదారులకు బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి భరోసా ఇచ్చి వారితో కలిసి కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహులు వినతి పత్రం అందజేశారు. నోటీసులు వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రజలను భయభ్రాంతులను చేస్తే ఊరుకునే సమస్య లేదని హెచ్చరించారు.

◆ ఇదే విషయంపై ఉప కమిషనర్ సైతం మంగళవారం వెన్నెలగడ్డ ప్రాంతాన్ని సందర్శించి స్థానికులతో మాట్లాడి వెళ్లారు. ఏది ఏమైనా అధికారులు ఇచ్చిన నోటీసులకు స్థానికుల్లో కంటిమీద కునుకు లేకుండా పోతుంది. ఈ విషయంపై అధికారులు ఏ విధమైన నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

50 ఏళ్లుగా ఉంటున్నా..



వెన్నెల గడ్డలో 60 గజాలలో 50 ఏళ్లుగా ఉంటున్న. అప్పట్లో గవర్నమెంటు పట్టా ఇచ్చింది. నా ఇద్దరు కొడుకులు, కోడళ్ళు పిల్లల కలిసి ఇదే ఇంట్లో ఉంటున్నాం. 4 రోజుల కిందట సార్లు నోటీసులు పంపారు. మా ఇళ్లను ఏం చేస్తారో భయమేస్తుంది. మా ఇళ్లకు ఏమి కాకుండా చూడాలి.

– ఏ.అనసూయ, వెన్నెలగడ్డ

కట్ట మీదుగా రోడ్డు వేయండి



వెన్నెలగడ్డ నుంచి జీడిమెట్ల విలేజ్ వరకు 30 ఫీట్ల రోడ్డు మంజూరు అయ్యిందంటా. కట్టమీద నుంచి రోడ్డు వేస్తే బాగుంటుంది. కానీ అధికారులు మాకు నోటీసులు ఎందుకు ఇచ్చారో అర్థం కావడం లేదు. 1992 నుంచి 60 గజాల స్థలంలో ఉంటూ ఆటో నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకు వస్తున్న. నాకు ఇద్దరు కుమారులు. ఒకవేళ మా ఇళ్లను ఖాళీ చేపిస్తే ఇక మాకు చావే శరణ్యం.

– భూమేష్, వెన్నెలగడ్డ